# నీడలో నిరీక్షణ




- గిడుగు రాజేశ్వరరావు

నాలుగు రోజుల పాటు ముసురు పట్టినట్టయిపోయింది. ముసురన్నా నయమే. తుడుసుకుంటూ స్వేచ్ఛగా తిరగొచ్చు. దుకాణం తెరవడం అటుంచి, ఇంటి వాకిలి తెరచి బయట కాలు పెట్టడం గగనమైపోయింది. ఎందుకో కొట్లాట. అది చిలికి చిలికి గాలివానలా మారింది. కత్తిపోట్లూ, గాయాలు, హాహాకారాలు ఆ వెనుక అప్పుడప్పుడు వినిపించే గస్తీ పోలీసుల బూట్ల చప్పుళ్ళు. రాత్రి కంటినిండా ఆ బస్తీలో ఎవ్వరూ నిద్రపోయినట్టు లేదు. రోజూ ఎదురు పడి తియ్యగా పలకరించుకునే మొహాల్లోనే ఏవో ఆందోళనలు, ఏవో సంకోచాలు, ఏవో క్రీనీడలు, ఇలాటి సమయాల్లో శంకరప్ప వింతగా ఆలోచిస్తాడు. ఒకణ్ణి ఇంకొకడు నమ్మకుండా భయంతో సందేహంతో రోజులు నెట్టుకు రావడం కూడా ఒక బతుకేనా అనుకుంటాడు.

శంకరప్ప తన చిన్నతనంలో అందరిలా ఏ బడికీ పోలేదు. ఎదురింటి బడిపంతులు ధర్మమా అని తెలుగక్షరాలూ అంకెలూ మాత్రం అరుగు మీద నేర్చుకున్నాడు. అంతే, పచ్చని గడ్డి కనుపించగానే అందుకునే ప్రయత్నం చేసే ఆవు దూడలాగ అచ్చుకాగితం దొరికితే చాలు అందులోని అక్షరాలు కూడ బలుక్కుని చదవడం ఒక వేడుకగానూ, రాను రానూ ఒక వ్యసనంగానూ చేసుకున్నాడు. మల్లేపల్లి మసీదు దగ్గర బట్టల దుకాణంలో చిన్న సేల్స్‌మన్‌గా చేరి నిలదొక్కుకోడానికీ, తండ్రి తనకిచ్చిపోయిన పాత కొంపలో సంసారాన్ని ఈదుకు రావడానికీ - ఆ మాత్రం చదువు పుష్కలంగా సరిపోయింది. దుకాణం యాజమాన్యం రతన్‌లాల్ నుంచి మురాదాలీకి, మురాదాలీ నుంచి అంజయ్య శేఠ్‌కీ చేతులు మారినా శంకరప్పని మార్చాలన్న అవసరం ఏ ఒక్కరికీ కనిపించలేదు.

తొమ్మిది కొట్టగానే ఇంట్లో నాస్తా చేసి, వేడిగా చా తాగి, బుగ్గలో జరదాపానొకటి పెట్టుకుంటాడు. చుట్టగా చుట్టి భార్య అందించిన రెండు రొట్టెలు చిన్న గుడ్డసంచీలో పెట్టుకుని బయలుదేరతాడు. పొడుగు చేతుల లాల్చీ, గోచీ పోసి కట్టిన పంచె, బూడిద రంగులో ఉన్న పాతకాలపు వెయిస్టు కోటు, తెల్లగా పండిన తలమీద డైమన్ ఆకారంలో ఉన్న నల్లని ముఖమల్ టోపీ దూరంగా కదలాడితే అది శంకరప్ప రూపమని ఆ వాడలో అందరికీ తెలుసు.

దుకాణం తలుపు తీసి, ఉదయాన్నే పేపరు కుర్రాడు తలుపు సందులో ఇరికించి పోయిన వార్తా పత్రికను అందుకుంటాడు. దుకాణం ఊడ్పించి, ఆగరొత్తులు వెలిగించి శేఠ్ వచ్చేదాకా పత్రికను ఆ మూలాగ్రం చదువుతాడు. అందులో చిత్రాలు చూస్తాడు. అప్పటికి నెమ్మదిగా అంగడిలో చైతన్యం పుంజుకుంటుంది. అంతలో అంజయ్య శేఠ్ వచ్చి తలగడల మధ్య ఇరుక్కుంటాడు. ఇద్దరు పోరగాళ్ళు వచ్చిన వాళ్ళకి తాన్లుతీసి బట్టలు చూపిస్తూ వుంటే వాళ్ళని అజమాయిషీ చేస్తూ, ఇంకొక గుమాస్తా బిల్లులు రాస్తూవుంటే ఒక కంట కనిపెడుతూ, జరుగుతున్న బేరసారాల్లో అవసరమైన మేరకు మాట కలుపుతూ దుకాణాన్ని నడిపిస్తాడు.



ఒక ఉదయం "ఏందివయ్యా శంకరప్పా ! అట్లుంటివి ? పానం మంచిగ లేదా? ఏదన్న పరేషానీ అయితె గాదుగదా ........." అని అంజయ్య కుదిపేదాకా శంకరప్ప తనచుట్టూ ముసురుకొంటున్న ఆలోచనల తెరల్లోంచి తేరుకోలేదు. కారణం లేకపోలేదు. ఆ రోజు పత్రిక తెరవగానే నేలనించి ఆకాశంలోకి కుక్కగొడుగు ఆకారంలో విస్తరిస్తున్న వెలుగు పొగ చిత్రాన్ని చూశాడు. దాని కింద అచ్చు వేసిన వివరాలు అక్షరం విడవకుండా చదివాడు. ఎవరో తన కడుపులోకి చేతులు



దూర్చి వెలిపెట్టినంతగా బాధ పడిపోయాడు. ఏభై ఏళ్ళ క్రితం జపాను దేశంలో అటంబాంబును పేల్చిన దృశ్యాలు, బాధలు, హాహాకారాలూ కళ్ళకు కట్టినట్టు అచ్చు వేశారు. ఆరోజు పత్రికలో తన చిన్నతనంలో, అమెరికా వోడు జపానోడి మీద బాంబులు వేశాడని గుండెబాదుకుంటూ పెద్దవాళ్ళు ఆవేదన పడ్డం జ్ఞాపకం వచ్చింది. కానీ, ఆ వయసులో తనకు ఆటంబాంబు మహానగరాల్ని శ్మశానంగా మార్చిందనీ లక్షల సంఖ్యలో జనాల్ని చంపిందనీ తెలిసిరాలేదు.


ఇంకో ఉదయం ఏదో ఆలోచనల్లో మునిగిపోయిన శంకరప్పను చూసిన అంజయ్య "ఏంది శంకరప్పా! పానం బాగుందా?" అని ఆత్రంగా అడిగాడు. "ఇంత జరిగినా మనుషులకి శరమన్నది లేదుగదా. అదేదో దేశపోళ్ళు మల్ల ఆటంబాంబులు సమందర్ల పేల్చినారట" అన్నాడు ఆవేదనగా. ఒక్కో సమయంలో అంజయ్యకి శంకరప్ప అర్థంకాడు. తన పిల్లా జల్లా మంచీ చెడూ అన్న మాటలేదు. ఎక్కడెక్కడి సమాచారమో చదివి పరేషానయిపోయే శంకరప్ప ఈ కాలంలో పుట్టరాదు - అని అంజయ్య అనుకుంటాడు.

"కత్తులు బట్టి రోడ్డున పడ్డాక ఎవలు ముందుగాల కత్తి ఇడవాలంటే ఆడికే బుగులాయె. ఇదంత పులిమీది సవారీ లెక్కుంది. మన చేత ఏముందిగానీ ఇయాల్టికి దుకాణం నే జూసుకుంట. నువ్వు ఖానాపురం పోయిరారాదు. బిడ్డ పెళ్ళికవి బట్టలు గొంచపోయిన పెద్దమనిషి శాన్రోజులయిపాయె. మాటన్న లేదుగదా" అన్నాడు అంజయ్య.శంకరప్ప క్యాడా ఆ ఉదయం దూకాణంలో కూర్చోబుద్ధికాలేదు. టోపీ పెట్టుకుని సంచిపుచ్చుకుని బయలు దేరాడు. ఆటంబాంబుల వ్యవహారమే ఇంకా తన మనసును ఆక్రమించి ఎన్నో సందేహాలు రేపుతోంది. మనిషిని మనిషినమ్మడు. ఇరుగుదేశం పొరుగు దేశాన్ని నమ్మదు. అందరూ మంటల్లో పడిపోతారుగానీ మంచిగ బతకలేరు. తిండి కోసం పంట పొలాల మీద పడే మిడతలే నయం. మంటలు చూపిస్తే పక్కకు తప్పుకుంటాయి - అనుకున్నాడు.

తను తొందరపడి ఎక్కిన బస్సు ఖానాపురం, పోదనీ, ఖానాపురం రోడ్డు మొదట్లో దిగి ఇంకో బస్సు ఎక్కాలనీ - కండక్టర్ టిక్కట్టు ఇవ్వడానికి వచ్చేదాకా శంకరప్పకు తెలిసిరాలేదు. "అడక్కుండ బస్సెందుకు ఎక్కుతరు" అని కసురుకున్న కండక్టర్ అంతలోనే అమాయకంగా కనిపించిన శంకరప్పనుచూసి శాంతించి "ఖానాపురం, రోడ్డొచ్చినాక యాది చేస్తా, దిగు ఇంకో బస్సు పట్కపోదువుగాని" అన్నాడు.

శంకరప్ప అలా మిట్ట మధ్యాహ్నం వేళ బస్సులోంచి బయట పడ్డాడు. ఎండ నిప్పులు చెరుగుతోంది. గొడుగైనా తెచ్చుకోక పోయినందుకు నొచ్చుకున్నాడు. దరిదాపులో చెట్టయినా లేదు. నీడకోసం మరీ దూరంగా పోతే బస్సు ఖానాపురం రోడ్డులోకి మలుపుతిరిగే వేళ ఉరుకుతూ వచ్చి అందుకోవడం కష్టమౌతుంది. పాడుపడ్డ ఇల్లు ఒకటి దగ్గరగా ఉంది. ఏనాటి కట్టడమో, పైకప్పు కూలింది. ఒక చిన్న వరండా మాత్రం చూరు మీది పెంకులతో కాసింత నీడగా తనకోసమే అన్నట్టు మిగిలింది. అక్కడక్కడ సాలిగూళ్ళు వ్రేలాడి దాని శిథిలావస్థని తెలియజేస్తున్నాయి. ఆ సావిడిలో ఒక స్తంభానికి ఆనుకుని చతికిలపడ్డ శంకరప్ప తన టోపీనీ సంచినీ పక్కన పెట్టి ఎండ తీవ్రతకు గాఢంగా నిట్టూర్చాడు. మెడకు ఉరిపోసినట్టున్న లాల్చీ గుండీని వదులు చేసి కాసింత స్థిమిత పడ్డాడు. నున్నగా తాపీ చేసిన గచ్చు అక్కడక్కడ పెచ్చులూడిన పాతకాలపు పనితనానికి సాక్షిలా ఉంది. ఆ గచ్చు చివర్న ఎండపడి, చీర చెరగులోని జలతారులా మిలమిలా మెరుస్తోంది.

బస్సు రావలసిన దిశగా దృష్టిసారించి ఎండలోకి అదే పనిగా చూడ్డంతో కళ్ళలో నీళ్ళు నిలిచాయి. దేనికో ఒక దానికోసం చూడ్డంలోనే మనిషి అలసిపోతాడనీ, విసిగి పోతాడనీ నిశ్చయించుకున్నాక వచ్చే బస్సు రాకుండా పోతుందా అని సమాధాన పరచుకుని తన చుట్టూ ఉన్న పరిసరాల మీదికి చూపు మరల్చుకున్నాడు. పోనీ బస్సు వచ్చేలోగా రొట్టెలు తింటే ఒక పని పూర్తవుతుంది అన్న ఆలోచన వచ్చి సంచిలోంచి రొట్టెల చుట్ట బయట పెట్టాడు. ఇంతలో తను కూర్చున్న అరుగు చివర ఏదో నల్లని నీడ కదలాడితే అటు చూశాడు. ఎక్కడ నుంచి వచ్చిందో ఒక నల్లని ఊరకుక్క. ఎర్రని రబ్బరులా వ్రేలాడుతున్న నాలుకను ఆడించుకుంటూ, రొప్పుతూ వచ్చి ఆ



అరుగు మీద కెగరబోయి మానవాకారాన్ని చూసి ఒక్క క్షణం అలాగే నిలిచి పోయింది. శంకరప్పకు భయం ఆవహించింది. దాన్ని చూసీ చూడనట్టు మొహం తిప్పుకున్నాడు. అక్కడినించి లేచి, ఎండైతే నేం, రోడ్డుమీదకు పోవాలని ఆలోచన వచ్చింది. కానీ, తను లేవడం కుక్క ఇంకో విధంగా అర్థంచేసుకుని మీద పడుతుందని భయంతో అలానే కదలకుండా కూర్చున్నాడు. అంత భయపడి పోవడానికి కొంత కారణం లేకపోలేదు. శంకరప్ప నాయన సాయంత్రం చీకటి పడ్డాక ఏదో గ్రామం వెళ్ళి వస్తూవుంటే దారిలో కుక్కకరిచింది. బొడ్డుచుట్టూ సూది మందు పొడిపించుకొని, బాధపడడం ఆక్షణంలో శంకరప్పకు గుర్తొచ్చింది.

అరుగు మీది కురకబోయిన కుక్క కూడా శంకరప్పని చూసి ఒక్క నిమిషం తటపటాయించి వెనక్కు మళ్ళింది. అలా కుక్క ఎక్కడికో పోగానే ధైర్యంగా ఊపిరి పీల్చుకుని సమస్య సులభంగా విడిపోయినందుకు స్థిమిత పడ్డాడు శంకరప్ప. ఏనాటిదో రామదాసు కీర్తనలో ఒక పల్లవి చిన్నగా అందుకుని ఆలపిస్తూ బస్సు శబ్దం చేసి నట్టనిపిస్తే చూశాడు. ఏదో లారీ బరువుగా భాగ్యనగరం దిశగా సాగిపోయింది.

ఖానాపురం వెళ్ళాలన్నా, తిరిగి వచ్చిన దారిన్నే వెనక్కు మళ్ళి పోవాలన్నా ఏదో బస్సుమీద ఆధారపడక తప్పదు. నడిచే దూరమూ కాదు, భరించగల ఎండకూడా కాదు. ఇలా ఎటూ కాకుండా ఇరుక్కుపోయినందుకు బాధపడుతూ, బస్తీలో ఏదో కారణంగా జరిగిన కొట్లాటల గురించీ బాంబుల తయారీలో దేశాల మధ్య పోటీ గురించీ, లోకంలోని ఈతి బాధల గురించీ ఆలోచిస్తూ నిరీక్షణలోని విసుగుదలను మరిచే ప్రయత్నం చేస్తున్నాడు. కాలం మందంగా సాగుతోంది.

ఇంతలో అరుగు చివరో ఏదో నీడ కదలాడింది. మళ్ళా అదే నల్లకుక్క. దృష్టిని ఇంకో వేపుకి మళ్ళించి అటు చూడనట్టు చలనం లేకుండా కూర్చున్నాడు - శంకరప్ప. ఈ సారి కుక్క వెనక్కు పోలేదు. స్తంభానికానుకుని కూర్చున్నమానవాకారాన్ని ఒక్కమారు నిశితంగా చూస్తూ అరుగు చివర కాసింత చోటు చేసుకు ముంగాళ్ళ మీద ముట్టెను ఆనించి పడుకుంది. దాని శరీరమంతా నీడలోకి నెట్టింది కానీ తోక మీద కాసింత ఎండ పడి మెరుస్తోంది. ఓరకంట దానివేపు చూసిన శంకరప్పలో ఇదివరకు గడ్డ కట్టిన భయం కాసింత కరుగుతున్నట్టు అనిపించింది. ఎండవేళ ఇదే నీడపట్టును చేరి పడుకోడం కుక్కకు బాగా అలవాటై పోయింది. సాధారణంగా ఏదైనా జాగాకు కుక్క అలవాటు పడ్డాక సులభంగా వదులుకోదు. అది స్వంతం చేసుకున్న జాగాలో కొత్త మనిషిని చూసిన సందేహమే తొలిసారి కుక్క వెనక్కు మళ్ళి పోడానికి కారణమై ఉంటుంది. ఇలా శంకరప్ప తన మనసులో సమాధానపడ్డాక గాఢంగా ఊపిరి పీల్చుకు స్థిమిత పడ్డాడు.

నౌకరీలో చేరిన తొలిరోజుల్లో ఒక దీపావళి రోజున రతన్‌లాల్ తన మీద అభిమానంతో ఇచ్చిన జేబు గడియారాన్ని మృదువుగా తీసి చూసుకున్నాడు. ఒంటిగంట గడిచి పదిహేను నిముషాలు కావస్తోంది. ఇలాటి ఎండవేళ రాకుండా ఎప్పుడైనా ఉదయాన్నే ఖానాపురం పని పెట్టుకుంటే ఈ నిరీక్షణా -; ఈ కష్టం తనకు తప్పేవి అనుకున్నాడు.. దుకాణంలో ఉంటే ఈ సరికి రొట్టెతిని ఎదురుగా ఉన్న ఇరానీలో చా తాగేవాడు. రొట్టెల చుట్టను చేతిలోకి తీసుకున్నాడు. కానీ దరిదాపులో కాసిన్ని మంచి నీళ్ళయినా దొరకవనుకున్నాక ఆ ప్రయత్నాన్ని వాయిదా వేసి రోడ్డు మీదికి కొంత సేపు దృష్టిసారించాడు. విసుగుదలతో ఆ దృష్టిని కుక్క వేపు మళ్ళించి అదేం చేస్తోందో అన్న కుతూహలంతో చూశాడు.

ఆశ్చర్యం వేసింది. దాన్ని వెంటతరుముతున్నట్టు ఎండ అరుగుమీదికి ప్రాకుతూవుంటే నీడ కోసం కుక్క కూడా పైపైకి జరుగుతూ శంకరప్ప దిశగా వచ్చింది. అనుకోకుండా పరస్పరం చూపులు కలిశాయి. దానికళ్ళలో తొలిసారి కనిపించిన ఆందోళన ఇ[illegible]డు లేదు. తోకను చిన్నగా ఎత్తి నేలమీ[illegible] రెండుసార్లు తట్టింది. శంకరప్ప ఆలోచనలు వింతగా స్వైర విహారం చేశాయి. తన బస్తీలో జరిగిన కొట్లాటలు, ఆవేశాలు, కత్తిపోట్లూ గుర్తుకొచ్చాయి. సముద్రంలో ఏదో దేశం పేల్చిన అణుబాంబులు జ్ఞాపకం వచ్చాయి. జపానులో మహానగరం నేలమట్టమైపోయిన చిత్రం కళ్ళముందు మెదిలింది. తన చుట్టూ ఉన్న ప్రపంచం - అందులోని మనుషులూ తనకి అర్థం కానట్టు నిట్టూర్చి మరోసారి జేబు గడియారం తీసి చూసుకున్నాడు. తన ఆలోచనల వలయంలోంచి బయట పడేసరికి అర్ధగంట గడిచిపోయింది.

కుక్క నాలుకను నిర్విరామంగా కదిలిస్తూ రొప్పుతున్న శబ్దం స్పష్టంగా దగ్గిరగా వినిపించింది. ఎండ వెంట తరుముతూ వుంటే నీడకోసం శంకరప్పకి చాలా దగ్గిరగా వచ్చేసింది. పెంపుడు కుక్కలా సుమారుగా తన చేతికందినంత దగ్గరగా వచ్చిన కుక్కను చూస్తే భయం ఆవిరైపోయి వింతైన అభిమానం చూటు చేసుకుంది - అతని మనసులో.

చేతికందిన రొట్టెలోంచి చిన్న తునకను తుంచి నోటి ముందుంచాడు. అది వాసన చూసి నాలుకతో అందుకుని మెల్లగా తన తోకను కదిలించింది. శబ్దంలేని ఆ భాషలో ఎంతో అర్థం, ఆత్మీయతా ప్రకటించింది. దాని కళ్ళలోని ఏదో వెలుగు - శంకరప్పని ముగ్ధుణ్ణి చేసింది. చేత్తో ఆ కుక్కని తాకందే ఉండలేకపోయాడు. తన వేళ్ళతో దాని రెండు చెవుల మధ్య మృదువుగా తట్టి వెన్ను మీద ప్రేమగా నిమిరాడు. తోకను చిన్నగా ఊపుతూ ఆ ప్రాణి దాని రెండు కళ్ళూ మూసుకుంది. అలా కుక్కను నిమురుతూ తన ఉనికినే మరిచిన శంకరప్పను పెద్దగా శబ్దంచేస్తూ ఖానాపురం రోడ్డులోకి మలుపు తిరిగిన బస్సు ఇహలోకంలోకి మేల్కొలిపింది. టోపీనీ సంచినీ చేత్తో అందుకుని హడావిడాగా పరుగు తీశాడు. అక్కడే విడిచిన రొట్టెల మీద ధ్యాస లేదు. ఎదలో ఏదో ఆనందాన్ని మోసుకుని బస్సు కడుపులో ఒదిగి పోయాడు.

●